
సాక్షి
అనంతపురం

శనివారం : 17 : మే : 2025



జిల్లాకు వర్షసూచన

రాగల ఐదు రోజులూ జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు తెలిపారు.



టన్ను చీనీ రూ.35,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.35,100, కనిష్టంగా రూ.6,200 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం 37.4°/23.9°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు నగరంలో తిరంగా యాత్ర

- ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు



అనంతపురం అర్బన్: 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవాన్ని పురస్కరించుకుని త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా శనివారం నగరంలో తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి తిరంగా యాత్ర ప్రారంభమై సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ ఎదురుగా ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు సాగుతుందన్నారు. దేశరక్షణలో అహర్నిశలు నిమగ్నమైన సైనికులకు సంఘీభావం తెలపడంతో పాటు జాతీయ జెండా గౌరవాన్ని ఇనుమడింపజేసేలా, దేశ సమైక్యత, సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా నిర్వహిస్తున్న తిరంగా యాత్ర ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ట్రాఫిక్, భద్రత సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు.

నేడే సేవ్ ఆర్డీటీ బైక్ ర్యాలీ

- హాజరుకానున్న పార్టీ ముఖ్య నేతలు



తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: ఆర్డీటీ సంస్థకు కేంద్రం ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య తలపెట్టిన 'సేవ్ ఆర్డీటీ' బైక్ ర్యాలీ శనివారం ఉదయం 8 గంటలకు బ్రహ్మసముద్రంలో ప్రారంభం కానుంది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో రంగయ్య ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో బైక్ ర్యాలీపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బైక్ ర్యాలీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, రాయదుర్గం, తాడిపత్రి సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.శ్యామల హాజరవుతారన్నారు. ఆయా మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఆర్డీటీ ద్వారా లబ్ధి పొందిన వారిని చైతన్య పరిచి కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

దళిత మహిళలపై దాడి చేసిన వారిపై కేసు

అనంతపురం/బ్రహ్మసముద్రం: తోటలో రాలిపడిన మామిడిపండ్లను తిన్న కుర్లగుండ గ్రామానికి ముగ్గురు దళిత మహిళలపై దాడి చేసి గాయపరిచిన తీటకల్లు గ్రామానికి చెందిన వారిపై ఎట్టకేలకు బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బొబ్బురు రామాంజనేయులు, అనిల్‌చౌదరి, క్రిష్టప్పలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బ్రహ్మసముద్రం ఏఎస్ఐ తిమ్మరాజు తెలిపారు. కాగా, ఈ దాడిలో చెవి కర్ణభేరి దెబ్బతినగా, అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న మమత అనే మహిళను ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పరామర్శించారు. పోలీసుల కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ ఎమ్మెల్యే కూతురి పెళ్లి బందోబస్తులో ఉన్నామని వచ్చిన తర్వాత విచారిస్తామని దాటివేయడం సిగ్గుచేటన్నారు. దళిత మహిళలపై విచక్షణారహితంగా దాడి చేసిన అగ్రకులస్తులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సాకే హరి వెంట జేఏసీ నాయకులు ఎస్. రామాంజినేయులు, రామకృష్ణ, నారాయణస్వామి, నరేంద్ర, నాగేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి మహిళా అభ్యర్థులే ఎక్కువ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి విడుదల చేసిన డీఎస్సీ–2025కు ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళా అభ్యర్థులే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్ 20న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ గురువారం రాత్రితో ముగిసింది. అనంతపురం జిల్లాకు సంబంధించి మొత్తం 29,078 మంది అభ్యర్థుల్లో 17,070 మంది మహిళలే ఉన్నారు. 12,008 మంది పురుష అభ్యర్థులున్నారు. అర్హతను బట్టి కొందరు అభ్యర్థులు రెండు, మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు.

సాంకేతిక దీప్తి.. విశ్వఖ్యాతి



కరువు సీమలో సాంకేతిక దీప్తిగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూ (అనంతపురం) మరో స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఎంతో మంది శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను దేశానికి అందించిన జేఎన్‌టీయూ(ఏ)14వ స్నాతకోత్సవం శనివారం అట్టహాసంగా జరగనుంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 49 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, గౌరవ డాక్టరేట్‌ను లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావాకు అందజేయనున్నారు. ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు.

- నేడు జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవం
- చాన్సలర్ హోదాలో ప్రసంగించనున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్
- లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్ డాక్టర్ సత్యనారాయణ చావాకు గౌరవ డాక్టరేట్
- 40,109 మంది విద్యార్థులకు డిగ్రీలు, 167 మందికి పీహెచ్‌డీల ప్రదానం



ముస్తాబైన జేఎన్‌టీయూ ఆడిటోరియం



అతిథుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

అనంతపురం: విశ్వఖ్యాతిగాంచిన జేఎన్‌టీయూ (ఏ) విశ్వవిద్యాలయం ఎందరో శాస్త్రవేత్తలు, ఇంజినీరింగ్ నిపుణులను ప్రపంచానికి అందించింది. ఏర్పడిన అనతి కాలంలోనే బీటెక్, బీ–ఫార్మసీ, ఫార్మా–డీ, ఎంటెక్, ఎం–ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు అందిస్తోంది. అలాగే పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. విదేశీ వర్సిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని నూతన ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి తెచ్చింది. వర్సిటీ పరిధిలో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్, తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 68 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు, 43 ఫార్మసీ కళాశాలలు, 24 ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ఏటా 1.30 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను అందిస్తున్నారు. జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల, కలికిరి ఇంజినీరింగ్ , పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లోనూ పరిశోధన చేయడానికి వీలుగా 16 రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో గణనీయమైన ర్యాంకు దక్కించుకుని అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకుంది.

చేయూత అ'పూర్వ'ం

క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పడి 78 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గతంలో ఇక్కడ చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వర్సిటీ పురోగతికి చేయూతనందించారు. రూ.8 కోట్ల వ్యయంతో 100 గదులతో కూడిన హాస్టల్‌ను పూర్వ విద్యార్థుల పేరుతో ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. రూ.50 లక్షలు విలువైన ల్యాబ్‌నూ ఏర్పాటు చేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ

జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో 2024–25లో బీటెక్ పూర్తి చేసిన మొత్తం 226 మంది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చాటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు దక్కించుకున్నారు. వీరిలో 10 మందికి ఏడాదికి రూ.11 లక్షల వేతనంతో కూడిన కొలువులు దక్కడం విశేషం.

జేఎన్‌టీయూ బంగారాలు:

జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ పరిధిలో 18 మందికి, జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల పరిధిలో ఏడుగురికి మొత్తం 49 బంగారు పతకాలు, ఎంటెక్‌లో ఒకరు, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో ఐదుగురి బంగారు పతకాలు దక్కాయి. వీరిలో జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు దక్కించుకుని వర్సిటీ ఖ్యాతిని ఇనుమడింపజేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా కాన్పూర్‌లోని ఐఐటీలో ఎమిరటర్స్ ప్రొఫెసర్ ఎం.ఆర్.మాధవ్ హాజరుకానున్నారు. అలాగే జేఎన్‌టీయూ (ఏ) పాలకమండలి సభ్యులు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు స్నాతకోత్సవం ప్రారంభమై.. మధ్యాహ్నం 12:30 గంటలకు ముగుస్తుంది. ముఖ్య అతిథిగా హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ కీలకోపన్యాసం చేయనున్నారు. లైవ్‌స్ట్రీమ్ ద్వారా స్నాతకోత్సవాన్ని వీక్షించే అవకాశాన్ని కల్పించారు.

అగ్రగామిగా తీర్చిదిద్దాలి

అన్ని రంగాల్లో జేఎన్‌టీయూ (ఏ)అగ్రగామిగా తీర్చిదిద్దాలని వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు అన్నారు. శుక్రవారం ఆయన జేఎన్‌టీయూలోని పాలకభవనంలో స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. నాణ్యమైన పరిశోధనలతో పాటు అత్యుత్తమ బోధన ప్రమాణాలతో కూడిన సాంకేతిక విద్యను అందించే దిశగా విద్యా ప్రణాళికలో సమూలంగా మార్పు చేశామన్నారు. గౌరవ డాక్టరేట్‌ను డాక్టర్ చావా సత్యనారాయణకు అందజేయడం గర్వంగా ఉందన్నారు. స్నాతకోత్సవ సందర్భంగా డిగ్రీలు అందుకునే విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు.



శుక్రవారం రాత్రి ఆడిటోరియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యువ పరిశోధకుడిగా ప్రారంభమైన 'చావా' ప్రస్థానం



ప్రతి స్నాతకోత్సవానికి విశిష్ట వ్యక్తులను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం జేఎన్‌టీయూ(ఏ) ఆనవాయితీగా పాటిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో 14వ స్నాతకోత్సవ గౌరవ డాక్టరేట్‌ను వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు లారస్ ల్యాబ్స్ ఫౌండర్ అండ్ సీఈఓ డాక్టర్ సత్యనారాయణ చావాకు అందజేయనున్నారు. ర్యాన్‌బ్యాక్సీలో యువ పరిశోధకుడిగా డాక్టర్ సత్యనారాయణ చావా విజయ ప్రస్థానం మొదలైంది. మ్యాట్రిక్స్‌లో చేరిన ఎనిమిదేళ్లకే ఆ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఎదిగారు. లారస్ ల్యాబ్ వ్యవస్థాపన (2005) (హైదరాబాద్)తో భారతీయ ఔషధ ఉత్పత్తుల రంగానికి దిశాదర్శకులయ్యారు. ఈ క్రమంలోనే ఆయన్ను 2021లో సాక్షి 'బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ఘనంగా సత్కరించింది. 18 సంవత్సరాల క్రితం ఏర్పాటైన లారస్ ల్యాబ్స్ కంపెనీలో ఇప్పటి వరకూ 150 కొత్త మందులు కనిపెట్టారు. 150 పేటెంట్లు దక్కాయి. రెస్పెక్ట్.. రివార్డు..రీటైయిన్ అనే మూడు ప్రాధాన్యత అంశాలుగా ల్యాబ్స్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

చాలా సంతోషంగా ఉంది



మాది వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల. నాన్న బ్రహ్మానందారెడ్డి, అమ్మ మంజుల. నాన్న కడప స్టీల్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు. బీటెక్‌లో టాపర్‌గా నిలవడం అందులోనూ ఆరు బంగారు పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం టాపర్ (ఒక గోల్డ్‌మెడల్), ఎండోమెంట్ గోల్డ్‌మెడల్ ఫర్ బెస్ట్ అకడమిక్ ఫర్‌ఫార్మెన్స్ అమాంగ్ బాయ్స్ (ఒక గోల్డ్‌మెడల్), చల్లా సుబ్బారాయుడు ఎండోమెంట్ గోల్డ్‌మెడల్, ప్రొఫెసర్ వి. పాండురంగడు గోల్డ్‌మెడల్ (థర్మోడైనమిక్స్ సబ్జెక్టులో టాపర్), 1992 బ్యాచ్ స్పాన్సర్డ్ గోల్డ్‌మెడల్ , చుండుపల్లి వెంకట్రాయలు.. సరోజమ్మ గోల్డ్‌మెడల్ ఇలా మొత్తం ఆరు గోల్డ్‌మెడల్స్ దక్కాయి. అంతేకాక కోర్సు పూర్తికాగానే ఎల్అండ్‌టీ కంపెనీలో ట్రైనీ ఇంజినీర్‌గా ఎంపికయ్యాను.

– నంద్యాల పూజిత్ కుమార్‌రెడ్డి

హనుమజ్జయంతికి ముస్తాబు


- కసాపురంలో రేపటి నుంచి హనుమజ్జయంతి
- ఐదు రోజులపాటు జరగనున్న ఉత్సవాలు



నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఏటా అత్యంత వైభవంగా జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ కే.వాణి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ఈఓ కార్యాలయం ముందు భాగంలో ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేసి.. అక్కడ 108 కలశాలను ఏర్పాటు చేసి ఐదు రోజుల పాటు యాగాలు, హోమాలు నిర్వహిస్తారు. ఈనెల 18వ తేదీన నెట్టికంటి ఆంజనేయ స్వామిని ప్రత్యేక పుష్పాలతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయ ముఖ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తికి తులసీ దళాలతో లక్షార్చన పూజ చేస్తారు. ఈనెల 19వ తేదీన నెట్టికంటి ఆంజనేయ స్వామిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. అదే రోజు సాయంత్రం ఉత్సవ మూర్తికి సింధూరంతో లక్షార్చన పూజ నిర్వహిస్తారు. 20వ తేదీన ఆంజనేయుడిని గంధంతో అలంకరిస్తారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి తమలపాకులతో లక్షార్చన పూజ చేస్తారు. 21వ తేదీన యాగశాలలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అష్టోత్తరశత కలశాలతో స్వామికి మహాభిషేకం చేయనున్నారు. వివిధ రకాల పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి మల్లె పూలతో లక్షార్చన పూజ నిర్వహిస్తారు. 22వ తేదీన హనుమజ్జయంతి సందర్భంగా హనుమంతుడిని స్వర్ణ, వజ్ర కవచాలతో అలంకరిస్తారు. ప్రత్యేక పుష్పాలు, తోమాలంకరణ అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కల్పిస్తారు. ఆలయ ముఖ మండపంలో ఉదయం 9 గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి పూర్ణాహుతితో ఉత్సవాలను ముగిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఆంజనేయ స్వామిని ఒంటె వాహనంపై కొలువు దీర్చి ప్రాకారోత్సవం నిర్వహిస్తారు.

అరెస్టులు అప్రజాస్వామికం: అనంత



అనంతపురం కార్పొరేషన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం దుశ్చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. మాజీ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్ అరెస్టులను ఖండించారు. వారిద్దరి అరెస్టులతో కూటమి సర్కార్ కక్ష సాధింపులు పరాకాష్టకు చేరాయన్నారు. సీఎం చంద్రబాబు సంక్షేమాన్ని పక్కన పెట్టి కక్ష సాధింపులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. లిక్కర్ కేసు విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు చూపకుండానే బెదిరింపులకు పాల్పడి... తప్పుడు వాంగ్మూలాలను తీసుకుని అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం కల్తీ జరిగిందని ఆరోపిస్తున్నారని... మరి కూటమి ప్రభుత్వం కూడా అవే డిస్టలరీల నుంచి మద్యాన్ని కొనుగోలు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లను లక్ష్యంగా చేసుకుని కొందరిపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు. ఇంత దారుణమైన పరిస్థితులను ఎక్కడా చూడలేదన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు అమలు చేయడం చేతకాని చంద్రబాబు.. ఏదో ఒక టాపిక్‌ను తెరపైకి తెచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఇది మంచి సంస్కృతికాదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సెయింట్ మేరీస్ బాలికల ఉన్నత పాఠశాల, ఆర్సీఎం ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో ఐదు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అందులో ఎస్ఏ బయాలజీ, ఎస్ఏ తెలుగు, ఎల్పీ తెలుగు, ఎల్పీ హిందీ, పీఈటీ పోస్టు ఉందన్నారు. వీటికి ఎలాంటి రిజర్వేషన్లు లేవన్నారు. అలాగే ఆర్సీఎం ప్రాథమిక పాఠశాలలో 5 ఎస్జీటీ పోస్టులు ఖాళీలున్నాయన్నారు. రోస్టర్ పాయింట్ ఎస్సీ బ్యాక్‌లాగ్, ఓసీ, ఎస్సీ, ఎస్టీగా ఉన్నాయన్నారు. రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 31వ తేదీలోపు https://cse.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు దరఖాస్తులు ఆయా పాఠశాలల్లో అందజేయాన్నారు. పరీక్ష నిర్వహణ తేదీ తర్వాత వెల్లడిస్తామన్నారు.

ఆర్టీసీలో కదిలిన అక్రమాల డొంక

- మలుపు తిరిగిన ఆర్టీసీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అక్రమాల బాగోతం
- భారీగా ముడుపులు దండుకుని తప్పుడు నివేదిక ఇచ్చిన విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్
- వాస్తవాలు బయటపడడంతో దీర్ఘకాలిక సెలవులో అధికారి
- జోనల్ విజిలెన్స్ అధికారి ముజఫర్ రహిమాన్ బాధితుల జాబితా చూసి తలలు పట్టుకుంటున్న అధికారులు



అనంతపురం క్రైం: ఆర్టీసీలో జోనల్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగంలో చోటు చేసుకున్న అక్రమాల తీగ లాగిన కొద్దీ కొత్త విషయాలు బయటపడుతున్నాయి. ఆర్టీసీ ఆదాయానికి పటిష్ట రక్షణ కవచంగా ఉండాల్సిన విజిలెన్స్ విభాగంలోని ఉన్నత స్థాయి అధికారులే అందిన కాడికి దోచుకున్నట్లుగా ఇప్పటికే విచారణాధికారులు నిగ్గు తేల్చారు. కడప జోనల్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడిన విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ అవినీతి సెగ ప్రస్తుతం ప్రధాన కార్యాలయాన్ని తాకింది.

ముజఫర్ ముతాకు మహిళా అధికారి దన్ను

ముజఫర్ అక్రమాలపై కొందరు బాధితులు నేరుగా విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధాన కార్యాలయంలోని విజిలెన్స్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఓ మహిళా అధికారినికి బాధ్యతలు అప్పగించారు. అప్పటి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న సదరు అధికారి రంగంలోకి దిగి విచారణ పేరుతో నాటకీయ పరిణామాలకు తెరలేపారు. చివరకు ముజఫర్ ఎలాంటి తప్పిదాలకు పాల్పడలేదంటూ ఓ నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ముజఫర్ నుంచి రూ.5 లక్షలు సదరు అధికారి తీసుకున్నట్లు తాజా విచారణలో వెలుగు చూసింది. ఈ విషయం తెలుసుకున్న సదరు అధికారి వెంటనే దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయినట్లు విస్తృతంగా చర్చ సాగుతోంది. ఆమె అక్రమాలకు సంబంధించిన బలమైన ఆధారాలను విచారణాధికారులు సేకరించారు. ఈ నివేదిక ఇంకా ప్రధాన కార్యాలయానికి చేరకనే ఆమె లాంగ్ లీవుపై వెళ్లడం అనుమానాలకు తావిస్తోంది.

లోతైన దర్యాప్తు చేయాలి

ముజఫర్ రహిమాన్ పని చేసిన సమయంలో ఉద్యోగులు, కార్మికులపై వచ్చిన అన్ని ఆరోపణలపై తిరిగి విచారణ చేపట్టాలని ఆర్టీసీలోని వివిధ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఓ కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరిపాలని కోరుతున్నారు. ఈ విచారణ జరిపితే అనంతపురం రీజినల్ కార్యాలయంలోని పెద్దల అవినీతి బాగోతాలు కూడా బయటపడతాయని వాదిస్తున్నారు.

వెలుగు చూస్తున్న అక్రమాల బాగోతం

కింది స్థాయి సిబ్బందిపై ఆరోపణ వస్తే చాలు వెనక ముందు ఆలోచించకుండా విచారణ పేరుతో పిలిపించి అందిన కాడికి విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముజఫర్ రహిమాన్ దోచుకున్నారు. ఈ క్రమంలో తప్పుచేసిన వారు బయటపడ్డామని సంబరపడితే.. ఎలాంటి తప్పు చేయని వారు అనవసరంగా డబ్బు పోగొట్టుకున్నామని బాధపడ్డారు. ఈ అక్రమాలపై బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. దీంతో కడప జోనల్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఈ తరహా బాధితులు సుమారు 60 మందికి పైగా ఉన్నట్లు విచారణ అధికారులు నిగ్గు తేల్చారు. 2023 నుంచి ఇప్పటి వరకు విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన ముజఫర్ రహిమాన్ ఇష్టారాజ్యంగా అక్రమాల బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూసింది. ఈ మొత్తం వ్యవహారం చూసిన విచారణాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

క్లుప్తంగా

ఎరువులు పక్కదారి పడితే చర్యలు : జేడీఏ

అనంతపురం అగ్రికల్చర్: నిబంధనలకు అనుగుణంగా డీలర్లు, దుకాణాదారులు రైతులకు ఎరువులు విక్రయించాలని, ఎరువులు పక్కదారిపట్టించినా, ఎంఆర్‌పీకి మించి అమ్మినా కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో కోరమాండల్, ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో ఎరువుల అంశంపై అధికారులు, డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ... కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చినందున పాత ఈ-మిషన్ స్థానంలో జిల్లాకు 785 ఈ-పాస్ మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో ప్రస్తుతానికి 65 మిషన్లు సొసైటీలు, డీలర్లకు పంపిణీ చేస్తున్నామన్నారు. రెండు మూడు రోజుల్లో అందరికీ ఇస్తామన్నారు. ఇక ఖరీఫ్ 1.10 మెట్రిక్ టన్నులు, రబీలో 75 వేల మెట్రిక్ టన్నుల వరకు ఎరువులు అవసరం ఉంటుందన్నారు. కేటాయింపుల మేరకు కంపెనీలు నెలవారీగా ఎరువులు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, అధికారులు విజయకుమార్, చెన్నవీరస్వామి, బాలానాయక్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తాడిపత్రి టౌన్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని శ్రీనివాసపురానికి చెందిన ఓబులయ్య (35)కు భార్య నాగేశ్వరి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డులో ఉన్న కాలవగడ్డ వీధిలో ఓ ప్రైవేట్ కళాశాల నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం ఇనుప కడ్డీలను యంత్రం సాయంతో కట్ చేస్తున్న సమయంలో పొరబాటున కేబుల్ కట్ కావడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం సీఐ వెంకటరమణ తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. శుక్రవారం ఉదయం కణేకల్లు క్రాస్‌లో కణేకల్లు ఎస్‌ఐ నాగ మధు ఆధ్వర్యంలో సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కళ్యాణదుర్గానికి చెందిన యువకుడు పిట్ట గంగాధర అలియాస్ సాంబ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీల అంశం వెలుగు చూసింది. క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు ఇతర వ్యసనాలకు బానిసగా మారి తన అవసరాలు తీర్చుకునేందుకు దొంగతనాలకు పాల్పడుతూ వచ్చినట్లుగా అంగీకరించాడు. ఏడాదిన్నర కాలంగా కణేకల్లులో 2, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి, అన్నమయ్య జిల్లా రాయచోటిలో 1, అనంతపురం రూరల్ పరిధిలో 2 చోరీ కేసుల్లో నిందితుడిగా పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి రూ.48 లక్షలు విలువ చేసే బంగారు నగలు, వెండి సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

పామిడి: భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడిలోని బీసీ కాలనీలో నివాసముంటున్న మాబూఖాన్ (30)కు గుంతకల్లుకు చెందిన నజియాతో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఆరు నెలల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన నజియా తన కుమారుడిని వెంటబెట్టుకుని పుట్టింటికి చేరుకుంది. నెలలు గడుస్తున్నా ఆమె కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన మాబూఖాన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై సీఐ యుగంధర్ శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైతు బలవన్మరణం

పెద్దవడుగూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం బందార్లపల్లికి చెందిన శ్రీనివాసులు (36)కు భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న 3 ఎకరాల పొలంలో పత్తి పంట సాగుతో పాటు గొర్రెల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పంటల సాగుకు, వ్యాపారానికి చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.9 లక్షలకు చేరుకుంది. ఇటీవల ఎకరం పొలం విక్రయించగా వచ్చిన డబ్బుతో కొంత మేర అప్పులు తీర్చాడు. మిగిలిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెందిన ఆయన శుక్రవారం తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఏడాదిలో అనంత రైల్వే స్టేషన్ విస్తరణ పనులు పూర్తి

- కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న



అనంత రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం సిటీ: అమృత్ భారత్ పథకం కింద అనంతపురం రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను 2026 నాటికి పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలసి స్థానిక రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వే శాఖ అధికారులు, ఇంజినీర్లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ అంబికాతో కలసి విలేకర్లతో మాట్లాడారు. అనంతపురం రైల్వే స్టేషన్ విస్తరణలో భాగంగా తొలి విడతలో రూ.30 కోట్లు, మలి విడతలో రూ.22 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఎస్కలేటర్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. పుట్టపర్తి-బెంగళూరు మధ్య నడిచే మెమూ రైలును అనంతపురం వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అనంతపురానికి మరిన్ని రైల్వే సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. ఢిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో హాల్ట్ కల్పించాలని, ధర్మవరం-మచిలీపట్నం రైలుకు రాయలచెరువు స్టేషన్‌లో స్టాపింగ్‌కు చొరవ చూపాలని విన్నవించారు. గుంతకల్లు డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ఒకరి మృతి

తాడిపత్రి: మండలంలోని ఇగుడూరు గ్రామం వద్ద బొలెరో లగేజీ వాహనం బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కొందరు కర్ణాటక ప్రాంతంలో కొనుగోలు చేసిన జీవాలను బొలెరో లగేజీ వాహనంలో ఎక్కించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం ఇగుడూరు గ్రామం వద్దకు చేరుకోగానే టైర్ పేలడంతో వాహనం అదుపు తప్పి రహదారిపై బోల్తాపడింది. ఘటనలో ప్రొద్దుటూరుకు చెందిన చాంద్‌బాషా (45) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ హుస్సేన్ బాషా, ఎర్రగుంట్లకు చెందిన ఆంజనేయులు, గంగప్రతాప్ గాయపడ్డారు. ఘటనపై రూరల్ పీఎస్ సీఐ శివగంగాధరరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- 4.5 కిలోల వెండి సామగ్రి, తులం బంగారం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: నియోజవర్గ వ్యాప్తంగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితల వివరాలను ఏఎస్‌ఐ రామాంజనేయులుతో కలసి సీఐ వంశీకృష్ణ వెల్లడించారు. కళ్యాణదుర్గం రూరల్, కంబదూరు పీఎస్ పరిధిలో గత ఎనిమిది నెలలుగా దేవాలయాల్లో చోరీలు జరిగాయి.రెండు స్టేషన్ల పరిధిలో మొత్తం నాలుగు కేసులు నమోదుకాగా, డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రూరల్ పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామం వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో ప్రశ్నించడంతో ఆలయాల్లో చోరీలకు పాల్పడింది తామేనని అంగీకరించారు. పట్టుబడిన వారిలో ఆరుల రాజశేఖర్, గొల్ల బొబ్బిలి రాము ఉన్నారు. వీరి నుంచి 4.5 కిలోల వెండి సామగ్రి, ఒక తులం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. విజయనగరం జిల్లాకు చెందిన వీరు సంచార జీవనం సాగిస్తూ ఓ ప్రాంతంలో కొన్ని నెలల పాటు తిష్ట వేసి, ఆ ప్రాంతంలోని ఆలయాల్లో చోరీలకు పాల్పడేవారు. వీరికి ఆధార్‌కార్డులు లేకపోవడంతో చోరీ జరిగిన సమయంలో వేలి ముద్రలు లభ్యమైనా ఆచూకీ దొరకకుండా తప్పించుకుని తిరిగేవారని పోలీసులు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానంటూ వంచన

తాడిపత్రి టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానంటూ మిత్రద్రోహానికి పాల్పడి రూ.లక్షలతో ఓ స్నేహితుడు ఉడాయించిన ఘటన తాడిపత్రిలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా రాయచోటికి చెందిన బుగ్గనపల్లి మహేశ్వరరెడ్డి 2015–19 విద్యాసంవత్సరంలో అనంతపురంలోని ఓ ఫార్మసీ కళాశాలలో చదువుకున్నాడు. అదే కళాశాలలో జూనియర్ విద్యార్థిగా ఉన్న తాడిపత్రిలోని శ్రీనివాసపురానికి చెందిన ఎండీ యాసీన్ ఇలాహితో పరిచయమై, ఇద్దరి మధ్య స్నేహం బలపడింది. చదువులు పూర్తయిన తర్వాత అప్పుడప్పుడు ఇద్దరూ కలుసుకుని మాట్లాడుకునేవారు. గత ఏడాది యాసిన్ ఇలాహికి మహేశ్వరరెడ్డి ఫోన్ చేసి తనకు తెలిసిన ఓ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. నెలకు రూ.1.15 లక్షలు ఇస్తారని, కటింగ్‌లన్నీ పోను రూ.90 వేల వరకు చేతికి అందుతుందని, ఆన్‌లైన్ ద్వారానే పనిచేయవచ్చునని వివరించి, వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు తీసుకున్నాడు. రెండు రోజుల తర్వాత యాసిన్ ఫోన్ నంబర్‌కు ఓ యువతి కాల్ చేసి, ఐకాన్ ఫార్మా కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా పరిచయం చేసుకుని వర్చువల్‌గానే ఇంటర్వ్యూ చేస్తున్నట్లు తెలిపింది. తర్వాత అదే రోజు సాయంత్రం జాబ్‌కు ఎంపికైనట్లు సమాచారం అందించారు. ఈ క్రమంలో మహేశ్వరరెడ్డి ఫోన్ చేసి కంపెనీ హెఆర్‌లు డబ్బు అడుగుతున్నారని, రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందని తెలపడంతో ఆ మొత్తాన్ని మహేశ్వరరెడ్డికి ఫోన్‌పే ద్వారా యాసిన్ చెల్లించాడు. మరుసటి రోజు మహేశ్వరరెడ్డి మళ్లీ ఫోన్ చేసి హెచ్‌ఆర్ హెడ్‌కూ డబ్బు ఇవ్వాల్సి వస్తోందని, మరో రూ.లక్ష పంపాలని తెలిపాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని యాసిన్ తెలిపి విడతల వారీగా మహేశ్వరరెడ్డికి ఫోన్‌పే ద్వారా రూ.86 వేలను చెల్లించాడు. రెండు నెలల్లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని తెలపడంతో యాసిన్ ఎదురు చూశాడు. మూడు నెలలైనా ఎలాంటి స్పందన లేకపోవడంతో మహేశ్వరరెడ్డికి కాల్ చేశాడు. అప్పటికి సమాధానమిచ్చిన అయన ఆ తర్వాత యాసిన్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో తాను మోసపోయినట్లు నిర్ధారించుకున్న యాసిన్ ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం మహేశ్వరరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మారథోత్సవం



పెన్నహోబిలంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఉరవకొండ/ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం బ్రహ్మారథోత్సవం వైభవంగా జరగనుంది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. దీంతో ఆలయ ఈఓ సాకే రమేష్ బాబు ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, ఉచిత భోజన వసతికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉరవకొండ ఆర్టీసీ డిపో నుంచి పెన్నహోబిలం ఆలయానికి ప్రత్యేకంగా 42 ఆర్టీసీ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ హంపయ్య తెలిపారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది తెలిపారు.

లారీ డ్రైవర్ దుర్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... జబల్‌పూర్ నుంచి బెంగళూరుకు అట్టపెట్టెల లోడుతో బయలుదేరిన లారీ శుక్రవారం తెల్లవారుజామున పెద్దవడుగూరు మండలం గుత్తిఅనంతపురం గ్రామ సమీపంలో కి చేరుకోగానే బ్రేక్ డౌన్ అయింది. దీంతో లారీని రోడ్డు పక్కన డ్రైవర్ ఆపేశాడు. డ్రైవర్ ఇమ్రాన్ (38) కిందకు దిగి లారీ వెనుక గమనిస్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన తమిళనాడుకు చెందిన లారీ ఢీకొంది. ఘటనలో ఇమ్రాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లారీల మధ్య ఇరుక్కుపోయిన ఇమ్రాన్ మృతదేహాన్ని వెలికి పామిడి సీహెచ్‌సీలోని మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు హర్యానాకు చెందిన వాడని, కుటుంబసభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఆటో బోల్తా.. బాలిక మృతి

పామిడి: మండలంలోని రామరాజుపల్లి సమీపంలో ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ బాలిక మృతి చెందింది. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన నాగేంద్ర తన సొంత ఆటోలో కుటుంబసభ్యులతో కలసి పెన్నహోబిలం చేరుకుని స్వామి దర్శనం చేసుకుని శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యారు. రామరాజుపల్లి సమీపంలో ప్రయాణిస్తుండగా ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో నాగేంద్ర కుమార్తె శైలజ (15) అక్కడికక్కడే మృతి చెందింది. నాగేంద్ర, సుదర్శన్, మోక్షిత, రాధమ్మకు గాయాలయ్యాయి. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు పూజలు



అలంకరణలో ముత్యాలమ్మ దేవత

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్ణాటకకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ దేవతకు పూజలు జరుగుతాయి.

మెరుగైన సేవలందించాలి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో చెస్ట్, డయాలసిస్ సెంటర్లను తనిఖీ చేశారు. చెస్ట్ వార్డులో రోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా డయాలసిస్‌లో వైద్యుల రోస్టర్‌ను తమకు పంపాలని సూచించారు. రెగ్యులర్‌గా వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? లేదా అని ఆరా తీశారు. డయాలసిస్ రోగులకు ఉత్తమ సేవలందించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు ఉన్నారు.

చిన్నారులను బడుల్లో చేర్పించండి



పాఠశాలలో చేరిన విద్యార్థులతో టీచర్లు

చెన్నేకొత్తపల్లి: ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్ నాయుడు తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో స్పెషల్ టీచర్లు వెంకటలక్ష్మి, నాగేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాల చిన్నారులను పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటా తిరిగి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఇద్దరు చిన్నారులను పాఠశాలలో చేర్పించుకున్నారు.

కేబుల్ చోరీ

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల గ్రామ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద గురువారం రాత్రి దొంగలు పడి ఏడు బోరుబావులకు అమర్చిన కేబుల్‌ను ఎత్తుకెళ్లారు. స్థానిక రైతులు తెలిపిన వివరాలు.. గ్రామ సమీపంలో వారాదయ్యకొండ కింద రైతులు నాగభూషణ, వెంకటస్వామి, అక్కులప్ప, లక్కావు పూజారి, పోతలయ్య, నాగరాజు, పెదన్న వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. రాత్రి వేళలో రైతులు ఇళ్లకు వచ్చిన సమయంలో దొంగలు పడి ఒక్కో బోరు వద్ద 20 నుంచి 30 మీటర్ల వరకు సుమారు 250 మీటర్ల కేబుల్‌ను కత్తించుకుని వెళ్లారు. చోరీ అయిన కేబుల్ విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నిత్యావసరాల వితరణ



ఆదరణ సేవా సమాజ్ ట్రస్టుకు నిత్యావసరాలు అందజేసిన దృశ్యం

అనంతపురం కల్చరల్: తపోవనంలోని శివశక్తి సాయిబాబా మందిరానికి సాయిట్రస్టు వారు శుక్రవారం కార్పెట్లను వితరణ చేశారు. ట్రస్టు నిర్వాహకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు వేదికగా ఉన్న మందిరంలో అందరికీ వసతి కల్పించేందుకు కార్పెట్లను అందించామన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే షిర్డీసాయి అన్న వితరణ ట్రస్టు వారు ఆదరణ సేవా సమాజ్ ట్రస్టుకు వృద్ధుల కోసం రూ.12 వేలు, నిత్యావసర వస్తువులను ఆశ్రమ నిర్వాహకులు తాడిమర్రి లాల్‌బాషా, ముంతాజ్‌కు అందించారు.

యువతి మృతి

తాడిపత్రి: అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీనరసమ్మ అనే యువతి శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాల మేరకు.. తక్కల్లపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి తన కుమార్తె లక్ష్మీనరసమ్మ (18)కు స్కూటీని నేర్పుతుండగా చల్లవారిపల్లి వద్దకు రాగానే ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఘటనలో తల్లి విజయలక్ష్మికి గాయాలవగా, కుమార్తె లక్ష్మీనరసమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం లక్ష్మీనరసమ్మ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

నగర'పాలన' అస్తవ్యస్తం

- కీలక పోస్టుల ఖాళీ
- కుంటుపడిన అభివృద్ధి పనులు
- సజావుగా సాగని చెత్త సేకరణ
- కమిషనర్‌పైనే అంతా భారం



అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థ పాలన పడకేసింది. అత్యంత కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటంతో పనులు జరగడం లేదు. జిల్లా కేంద్రంలోనే ఇటువంటి దుర్భర పరిస్థితిని చూస్తుంటే.. కూటమి ప్రభుత్వం విజన్–2047 ఇదేనా అనిపిస్తోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, చోటా నాయకుల దెబ్బకు వామ్మో ఇక్కడ పని చేయడం కంటే ఎక్కడైనా మరో ప్రాంతంలో పని చేసుకునేది మేలని కొందరు అధికారులు చెబుతున్నట్లు జోరుగా ప్రచారం నడుస్తోంది.

ఇక్కడి పని చేయలేం బాబోయ్..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నగరపాలక సంస్థలోని కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకరి తర్వాత ఒకరు అధికారులంతా క్యూ కడుతున్నారు. ఇక్కడి పని చేయలేం బాబోయ్ అంటూ వెళ్లిపోయారు. ప్రధానంగా నగరంలో 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయల పరిధిలో 77 హౌస్ హోల్డ్స్ ఉన్నాయి. కాగా దాదాపుగా నగరంలో 4 లక్షల నుంచి 5 లక్షల మంది వరకు జనాభా ఉన్నట్లు ప్రస్తుత అంచనా. ఇక్కడ ప్రజారోగ్యం అత్యంత కీలకం. ఆ విభాగానికి సంబంధించి కీలక ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ అయ్యింది. గతంలో ఇక్కడ పని చేసిన ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి కుక్కల స్టెరిలైజేషన్‌తో పాటు కార్మికులకు పనిముట్ల కొనుగోలు విషయంపై ఇతడిపై విమర్శలు వచ్చాయి. దీంతో ఆయన తన మాతృ సంస్థకు పరుగులు పెట్టారు. వాస్తవంగా నగరంలో రోజూ వివిధ డివిజన్ల నుంచి 130 టన్నుల నుంచి 150 టన్నుల చెత్తను తరలించాల్సి ఉంటుంది. దీంతో పాటు నగరంలో కుక్కల బెడద తదితర వాటిపై చర్యలు తీసుకోవాలి. ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ అవడంతో చెత్త తరలింపు, తదితర వాటిపై ఇబ్బందిగా మారే పరిస్థితి నెలకొంది. అద్దె ట్రాక్టర్లు పూర్తి స్థాయిలో చెత్తను తీసుకెళ్లడం లేదు.

టౌన్ ప్లానింగ్‌కు ఇద్దరే దిక్కు

నగరంలో అనధికార భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నగరంలోని ఏ వీధిలో చూసినా అనధికార నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. ప్లాన్ ఒకలా తీసుకోవడం నిర్మాణం మరోలా చేపట్టడం పరిపాటిగా మారిపోయింది. టౌన్ ప్లానింగ్ విభాగంలోని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రెండు పోస్టులు, టీపీఎస్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మొత్తం 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులమ్మ నగరాన్ని పంచుకున్నారు. కానీ వీరు క్షేత్రస్థాయిలో పర్యటించే పరిస్థితి లేదు. అంబేడ్కర్ నగర్, భవానీ నగర్, నగర శివారు ప్రాంతాల్లో ఎవరైనా కాలువలపై నిర్మాణం చేపడుతుంటే అక్కడ వాలిపోయి ఆ నిర్మాణాలను ఆపుతుంటారు. నగరపాలక సంస్థకు కూతవేటు దూరంలో ఉన్న కమలా నగర్‌లో ఒకే వీధిలో 5 సెల్లార్లు కట్టినా.. వీరి వాహనం అటువైపు వెళ్లదు. ఆయారాం గయారాం అన్న చందంగా వీరు విధులు నిర్వర్తిస్తూ విమర్శల పాలవుతున్నారు. నూతనంగా భవనాలు నిర్మిస్తుంటే ప్రారంభంలోనే హంగామా చేయడం.. ఆఫీసులోని ఏసీ గదుల్లో కూర్చునేందుకే వీరికి సమయం సరిపోతుంది.

ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలోనూ అంతే..

అదేవిధంగా నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన అదనపు కమిషన్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ గతంలో పని చేసిన ఏసీలు కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధుల దెబ్బకు పరుగులు తీశారు. అదేవిధంగా ఆఫీస్ మేనేజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అస్తవ్యస్తంగా మారింది. మెప్మాకు సంబంధించి టీపీఓ, టీఎంసీ కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంజినీరింగ్ విభాగంలోనూ ఈఈ పోస్టులో ఓ డీఈకి పట్టం కట్టారు. ఇక ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీర్లు గురించి చెప్పాల్సిన పనిలేదు. వీరు ఎటువంటి అభివృద్ధి పనులను పర్యవేక్షించరు. ఒక వేళ ఎక్కడైనా ఒకటో రెండో పనులు జరుగుతుంటే అక్కడికి వర్క్ ఇన్‌స్పెక్టర్లను వదిలేసి చేష్టలుడిగి చూస్తున్నారన్న విమర్శలున్నాయి.

అధికార యంత్రాంగం విఫలం

నగరంలో ఏ కార్యక్రమం జరిగినా జిల్లా అధికార యంత్రాంగానికి చౌకగా గుర్తుకొచ్చేది నగరపాలక సంస్థనే. కానీ అటువంటి విభాగానికి పూర్తి స్థాయిలో అధికారులను తీసుకురావడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైనట్లు తెలుస్తోంది. కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో భారమంతా నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామిపైనే పడుతోంది. ఒక్క వ్యక్తే అన్ని చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

నేడు శ్రీవారి బ్రహ్మరథోత్సవం



శ్రీదేవి, భూదేవీ సమేత ప్రత్యేక అలంకరణలో శ్రీనివాసుడు

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోట ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవం జరగనుంది. ఉదయం 11 గంటలకు మడుగుతేరు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల్ని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బ్రహ్మ రథంలో అధిష్టిస్తారు. 5 గంటలకు వేదమంత్రోచ్చారణ మధ్య స్వామి రథం కదులుతోంది. వినాయక సర్కిల్ దాటుకుని బళ్లారి రోడ్డులోని బోడ్డురాయి వరకు భక్తుల నడుమ స్వామి ఊరేగింపు ఉంటుంది. ఏర్పాట్లను శుక్రవారం రాత్రి అధికారులు పరిశీలించారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వేలాదిగా తరలిరానున్నారు.

19న ఉద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం టవర్‌క్లాక్: ఈనెల 19న సాయంత్రం అనంతపురం రూరల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా వేణుగోపాల్, కేసీ నాగరాజును నియమించామన్నారు. ఉద్యోగులు తమ ఓటుహక్కును సద్వినియెగం చేసుకోవాలని సూచించారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



రాప్తాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాప్తాడు: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. డెంగీపై అప్రమత్తత చాలా అవసరమని ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారంస్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణను శుభ్రంగా ఉంచుకునేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన లేకపోవడంతోనే వ్యాధులు విజృంభిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లయితే వెంటనే తమ పరిధిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. మురుగు నీటి కాలువల్లో ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమలను నివారించవచ్చన్నారు. డెంగీ వ్యాధి సోకకుండా ఉంటుందన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే పాటించాలని.. ఓవర్ హెడ్ ట్యాంకులకు మూత పెట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, ఎంపీహెచ్‌ఏ డేవిడ్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు ప్రజలకు సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఎన్ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. డాక్టర్ సరిత, డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ గేట్‌లోని నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ సాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటనారాయణ, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, విష్ణువర్దన్, భాస్కర్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలని స్వామి అర్చనానంద మహారాజ్ సూచించారు. హెచ్చెల్సీ కాలనీలోని స్వామి దయానంద గురుకులం వేదికగా గత 15 రోజులుగా సాగుతున్న ఆధ్యాత్మిక వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి శారదా ట్రస్టు తరపున అర్చనానంద మహారాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వేసవి శిక్షణ అంటే డ్యాన్సులతో హోరెత్తించడం కాకుండా పిల్లల్లో ఉత్తమ గుణాలను పెంపొందించే ప్రార్థనా శ్లోకాలు, సరళ యోగ, ప్రాణాయామం, ధ్యానం, మేధస్సును పెంచే ఆటపాటలు అద్భుతంగా నేర్పించారని శిక్షకులను అభినందించారు. అనంతరం స్వామీజీ చేతుల మీదుగా చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, ఆధ్యాత్మిక గ్రంథాలు అందజేశారు. దేశభక్తి ఉట్టిపడేలా చిన్నారుల వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీధరమూర్తి, డాక్టర్ కృష్ణవేణి, ప్రవీణ్ కుమార్, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగరవాసికి నరకం

'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అనే సామెతలోని ఇబ్బందిని నగర వాసులకు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి శుక్రవారం తన కుమార్తె వివాహం జరిపించారు. వీవీఐపీలు, వీఐపీలు కాన్వాయ్‌లతో తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో తపోవనం, టవర్‌క్లాక్, సప్తగిరి, రాంనగర్, రుద్రంపేటలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చివరకు సర్వజనాస్పత్రికి అత్యవసర రోగులను తీసుకెళ్లే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయాయి. కి.మీ. దూరం ప్రయాణించేందుకు గంటకు పైగా సమయం పట్టడంతో.. అమిలినేని తీరుపై నగర వాసులు అసహనం వ్యక్తం చేశారు. కూతురు పెళ్లి వైభవంగా చేయాలనుకోవడంలో తప్పు లేదు గానీ.. అయితే ప్రజలను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. అలాగే వీవీఐపీల సౌకర్యార్థం ఉలవచారు హోటల్ సమీపంలో 44వ జాతీయ రహదారికి వేసిన రక్షణ కంచెనూ తొలగించడం విమర్శలకు తావిచ్చింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కళ్యాణదుర్గం బైపాస్‌లో కిలోమీటర్ మేర ఆగిపోయిన వాహనాలు



ట్రాఫిక్‌లో ఆగిపోయిన అంబులెన్స్



తపోవనం సర్కిల్‌లో వాహనదారుల అవస్థలు

ఖేలో ఇండియా పోటీల్లో కాంస్య పతకాలు

ఉరవకొండ: ఖేలో ఇండియా జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన క్రీడాకారులు కాంస్య పతకాలు సాధించి, ప్రధానిమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. శుక్రవారం జాతీయ స్థాయిలో కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ సప్తగిరి మల్లి, ప్రెసిడెంట్ ఎంఎస్ షాహిన్‌లు ప్రత్యేకంగా ఉరవకొండలో సత్కరించారు. ఈసందర్భంగా చైర్మన్ సప్తగిరిమల్లి మాట్లాడుతూ మే 5 నుంచి 10 వరుకు బిహార్‌లోని పాట్రాలో జరిగిన జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.అమృత, మానస, పవిత్ర, సురేఖ, సుస్మిత ఆంధ్రప్రదేశ్ తరపున ఆడి రాజస్థాన్, కేరళ, బిహార్‌పై గెలుపొంది, కాంస్యపతకాలు సాధించారన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సెపక్‌తక్రా జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లి

వర్షం వస్తే భయం భయం..

- గొల్లపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలో నిలుస్తున్న నీరు
- పాచి పట్టడంతో రాకపోకలకు అంతరాయం
- ఇటీవల బ్రిడ్జి దాటే క్రమంలో కిందపడటంతో ఇద్దరికి గాయాలు
- సమస్యను పట్టించుకోని అధికారులు



బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

రాప్తాడు: వర్షం వచ్చిందంటే చాలు.. ఆ గ్రామ ప్రజలు బ్రిడ్జి కింద వెళ్లాలంటే భయపడుతున్నారు. ధైర్యం చేసి ముందుకు అడుగు వేస్తే జారి కింద పడి గాయాలపాలవుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. హైదరాబాద్–బెంగళూరు 44వ నంబర్ జాతీయ రహదారి మండలంలో దాదాపుగా 30 కిలోమీటర్లు ఉంటుంది. గతంలో ఈ రహదారి 7వ నంబర్ జాతీయ రహదారిగా 2 లైన్ ఉండేది. ఈ రహదారిని గత 20 ఏళ్ల క్రితం 4 లైన్ల రహదారిగా మార్పు చేస్తూ 4 లైన్ రహదారి వేశారు. ఈ జాతీయ రహదారి వెంట మండలంలో పలు గ్రామాలు ఉన్నాయి. మండలంలోని గొల్లపల్లి గ్రామం రోడ్డుకు రెండు వైపులా ఉండటంతో అప్పట్లో ఆర్‌అండ్‌బీ, హైవే అథారిటీ అధికారులు గ్రామం మధ్యలో పెద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. బ్రిడ్జి మధ్యలో అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జి ద్వారా ఇవతల ఉన్న వారు అవతలికి.. అవతల ఉన్న వారు ఇవతలికి రావాలంటే బ్రిడ్జి కింద వెళ్లాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి వర్షపు నీరు బ్రిడ్జి కిందనే నిలబడి ఉంటోంది. వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో పాచి పట్టింది. ఎవరైనా నడుచుకుంటూ వెళ్తే జారి పడుతున్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్లినా కింద పడటం ఖాయం. ఇప్పటికే చాలా మంది కింద పడి గాయాలపాలయ్యారు. చాలా మంది భయపడి బ్రిడ్జిని చుట్టేసుకుని రోడ్డు దాటి అవతల వైపునకు వెళ్తున్నారు. అలా వెళ్తూ రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రోడ్డు దాటే క్రమంలో కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయకుంటే ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందేవారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలవకుండా బయటకు వెళ్లేలా చూడాలని గొల్లపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలబడి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. పాచి పట్టడంతో బ్రిడ్జి కింద వెళ్లాలంటే భయం వేస్తోంది. అడుగు ముందుకు వేస్తే జారి పడిపోతున్నాం. నేను కూడా పలు మార్లు కింద పడ్డాను. రోడ్డు అవతలి వైపు ప్రభుత్వ పాఠశాల ఉంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి కింద నీరు నిలవకుండా చూడాలి. – పెద్ద మల్లేష్, గొల్లపల్లి

అధికారులు పట్టించుకోవడం లేదు



బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. వర్షపు నీటిలో నడవాలంటే ఎక్కడా పడిపోతామో అని భయం వేస్తోంది. మా గ్రామంలో రోడ్డు అవతల వైపు పాఠశాల ఉంది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే తల్లిదండ్రులు బ్రిడ్జి కింద వైపు రోడ్డు దాటించాలి. మళ్లీ పాఠశాల వదిలినప్పుడు కూడా తల్లిదండ్రులే వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకురావాలి. బ్రిడ్జి కింద నీరు నిలబడకుండా ఉంటే పిల్లలే బ్రిడ్జి కింద నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – ఆదినారాయణ, గొల్లపల్లి

ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం



జ్ఞాపికలను చూపుతున్న విద్యార్థులు

రామగిరి: విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 2024–25 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఎంజేపీ గురుకులాలు, బీసీ వసతి గృహాల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. పేరూరు డ్యాంలో ఉన్న ఏపీఆర్ఎస్ (మహాత్మా జ్యోతిబాపూలే) బాలుర పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు హరినాథ్, మోహన్‌ను బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరచి అవార్డులు అందుకున్న విద్యార్థులను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.





అడెలా స్ట్రాఫెకోవా: చెక్ రిపబ్లిక్

హైదరాబాద్ లో జరిగే 72వ మిస్ వరల్డ్ ఫెస్టివల్ లో చెక్ రిపబ్లిక్‌కు ప్రాతినిధ్యం వహిస్తుంది అడెలా స్ట్రాఫెకోవా. 21 ఏళ్ల ఈ బ్యూటీ మోడల్, ఫిట్నెస్ ట్రైనర్, ఈవెంట్ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పనిచేస్తోంది. కనెక్టింగ్ హార్ట్స్ అక్రాస్ జనరేషన్స్ పేరుతో రెండు, మూడు తరాల వారిని ఒకచోట చేర్చడం, ప్రేమ, దయ, స్నేహపూరిత వాతావరణాన్ని వ్యాప్తి చేయడంపై దృష్టి పెడుతుంది. 'ఏదైనా సాధించాలనుకోవడానికి ముందు తమకు నిజంగా ఏం కావాలో తెలుసుకోవడం ముఖ్యం' అంటూ తన గురించి తెలియజేసింది.

మనల్ని మనం తెలుసుకోవడమే..

"అందాల కిరీటం అనేది ఒక ఏడాది వరకే. కానీ, చాలామందితో కనెక్ట్ అవ్వచ్చు. నా కల ఒక్కటే! మిస్ వరల్డ్‌గా నన్ను నేను చూసుకోవాలి. నా చిన్నప్పటి నుంచే ఈ ఆలోచన ఉండేది. మా అమ్మ మేకప్ వస్తువులన్నీ నేనే వాడేసేదాన్ని. అమ్మ డ్రెస్సులు, హీల్స్ వేసుకొని ఇంట్లో తిరిగేదాన్ని. పదిహేనేళ్ల వయసు నుంచి అందాల పోటీలలో పాల్గొంటూ వచ్చాను. పదిహేడేళ్ల వయసులో మొదటి సారి ప్రపంచ పోటీలో పాల్గొన్నాను.

> అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

విజయసాధనకు..

బ్యూటీ కాంటెస్ట్‌లో చాలా ఛాలెంజెస్ ఉంటాయి. వివిధ రంగాలలో మమ్మల్ని పరీక్షిస్తారు. వాటిలో పాల్గొన్నప్పుడు కొంత ఆందోళనగా కూడా ఉంటుంది. కానీ, నన్ను నేను నిరూపించుకోవడానికి ముఖ్యమైన సమయం అదే. మిస్ బ్యూటీ కావాలని కలలు కనే యువతులు అనుకరించడం కాదు. ముందు తామేం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. నిజంగా ఏదైనా కోరుకుంటే 200 శాతం ప్రయత్నించాలి. అప్పుడే విజయం సాధించగలం. ఒక్క మిస్ విషయమే కాదు నేను ఏదైనా కోరుకున్నప్పుడు విజయం కోసం నా వంతుగా మొత్తం ప్రాణం పెట్టేస్తాను. అలాగే, విజయాలూ సాధించాను. కోరుకున్నది పొందాలంటే సరైన సమయం, శక్తి, దృష్టి పెడితే అదే మనకు అదృష్టంగా మారుతుంది. అందాల పోటీలలో పాల్గొనడమంటే అన్ని విధాల తమని తాము మానసికంగా, శారీరకంగా సంసిద్ధులను చేసుకోవడమే.

ఫిట్‌నెస్ ట్రైనర్

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. స్విమ్, రన్నింగ్, హార్స్ రైడింగ్ చేస్తాను. మోడలింగ్ నా కెరియర్. జీవనాధారం కూడా అదే. ఫిట్‌నెస్ ట్రైనర్‌గా కోచింగ్ ఇస్తాను. ఆ సమయంలో చాలా ఆనందిస్తాను. ఫిట్‌నెస్ గురించి నేను చెప్పే విషయాలు వినడమే కాదు, వాళ్లు ఆచరణలో పెడతారు. ఓ గొప్ప సమాజమే నాతో పాటు ఉందనిపిస్తుంది. వారితో నా అనుభవాలను పంచుకోవడం కూడా నాకు చాలా ఇష్టం. వారానికి కనీసం రెండుసార్లు ఫిట్‌నెస్ గ్రూప్‌లకు కోచ్‌గా పనిచేస్తాను.

నాకు ప్రస్తుతం ఉన్న క్షణం చాలా ముఖ్యమైనది. అందుకే ఈ క్షణంలో మాత్రమే జీవిస్తాను. సాధ్యమైనంత వరకు ప్రపంచాన్ని తెలుసుకోవాలి అనుకుంటాను.

ఫ్యాషన్ గురించి

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తను ధరించే దుస్తుల ద్వారానే వ్యక్తపరచగలడు. మేం చెక్ రిపబ్లిక్‌లో స్థిరపడినా వివిధ దేశాలకు సంబంధించిన దుస్తుల్లో నన్ను నేను చూసుకుంటాను" అని వివరించారీ బ్యూటీ.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: ఎస్.ఎస్. ఠాకూర్



● సంకల్ప బలం

వెయిట్ లిఫ్టర్ బామ్మ @70

వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్‌కి రెడీ

అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో జిమ్‌లోకి అడుగు పెట్టిన రోషిణి... ఇప్పుడు ఎన్నో వ్యాయామాలలో ఆరి తేరింది. వెయిట్ లిఫ్టింగ్‌లో పట్టు సాధించింది. అమెరికాలో జరగబోయే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'లో పాల్గొనడానికి రెడీ అవుతోంది 70 సంవత్సరాల రోషిణి.



● అజయ్, రోషిణి

కుమారుడితో కలిసి ఢిల్లీలో ఉంటున్న రోషిణికి ఎడమ కాలి మోకాలినొప్పి మొదలైంది. మెట్లు ఎక్కడం, నడవడం కష్టంగా మారింది. ఆమె ఎడమ మోకాలికి ఆస్టియో ఆర్థరైటిస్ ఉన్నట్లు గుర్తించారు. కుడి చూపుడు వేలు బలహీన పడింది.

ఫిజియో థెరపీ మొదలు పెట్టింది.

'ఈ టైమ్‌లో అమ్మకు జిమ్ అవసరం ఉంది' అనుకున్నాడు ఆమె కుమారుడు, ఫిట్‌నెస్ కోచ్ అయిన అజయ్.

68 సంవత్సరాల వయసులో తొలి సారిగా జిమ్‌లోకి అడుగు పెట్టింది రోషిణి.

మెల్ల మెల్లగా ఆమెకు సాంత్వన చేకూరింది.

స్ట్రెచ్చింగ్, మూమెంట్ ఎక్సర్‌సైజ్‌లతో మొదలుపెట్టి వర్కవుట్స్‌ను ఎంజాయ్ చేయడం మొదలుపెట్టింది. రెగ్యులర్ ట్రైనింగ్ వల్ల చేయి బలపడింది. రోజువారీ పనులు కష్టంగా అనిపించేవి కాదు.

జిమ్ ఉత్సాహం ఆమెను వెయిట్ లిఫ్టింగ్ వైపు తీసుకువచ్చింది.

ఇప్పుడు రోషిణి ట్రాప్‌బార్ డెడ్‌లిఫ్ట్‌లో 97 కేజీల బరువు ఎత్తుతుంది.

80 కేజీల కన్వెన్షనల్ డెడ్‌లిఫ్ట్స్ చేస్తుంది.

50 కేజీల స్క్వాట్స్ చేస్తుంది.

120 కేజీల లెగ్ ప్రెస్ చేస్తుంది.

4 నిమిషాల పాటు ప్లాంక్ పట్టుకోగలదు.

ప్రతిరోజూ రెండు గంటలు స్ట్రెంత్ ట్రైనింగ్, కార్డియో చేస్తుంది.

'దువ్వెన పట్టుకోవడం కూడా కష్టమే అని ఒకప్పుడు డాక్టర్లు అమ్మ గురించి చెప్పారు' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అజయ్. జిమ్‌లో వర్కవుట్స్ పుణ్యమా అని ఇప్పుడు రోషిణికి ఇన్‌స్టాగ్రామ్‌లో వేలాదిమంది ఫాలోవర్స్ ఉన్నారు. వారు ఆమెను ప్రేమగా 'వెయిట్‌లిఫ్టర్ మమ్మీ' అని పిలుచుకుంటారు.

డైట్ విషయానికి వస్తే...

'ఎలాంటి రిస్ట్రిక్షన్‌లు లేవు. నాకు దహీ బల్లే అంటే చాలా ఇష్టం. అలా అని అదేపనిగా తినను. అప్పుడప్పుడు మాత్రమే తింటాను. ఏదైనా ఎక్కువ తీసుకోవడం మంచిది కాదు' అంటుంది ఇంటి భోజనాన్ని ఇష్టపడే రోషిణి.

వచ్చే సంవత్సరం అమెరికాలో జరిగే 'వరల్డ్ స్ట్రెంత్ గేమ్స్'కి ఆమెకు ఆహ్వానం అందింది.

ప్రస్తుతం రోషిణి ఆ ఈవెంట్ కోసం ప్రాక్టీస్ చేస్తోంది.

'ఒకప్పుడు నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఇప్పుడు మాత్రం బయటికి వెళుతున్నాను. రకరకాల కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. ఇప్పుడు సంతోషంగా ఉంది' అంటుంది రోషిణి.

'సీనియర్ సిటిజన్స్ జిమ్‌లో వ్యాయామాలు చేసినప్పుడు అది వాళ్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. వారి నుంచి యువతరానికి సందేశం అందుతుంది' అంటున్నాడు అజయ్.

ఎండాకాలం వచ్చిందంటే గృహిణులకు చేతినిండా పనే.
ఎండను డబ్బాల్లో దాచి పెట్టాల్సిందే...
అప్పడాలు, వడియాల పని పట్టాల్సిందే!
పప్పులో.. పులుసులో.. సాంబారులో.. రసంలో...
ఇలా దేనిలో నంచుకున్నా ఆ రుచి అదుర్స్.
అన్నింటినీ మించి అప్పడం ఒక్కటి ఉంటే చాలు...
విందు భోజనం చేసిన ఫీలింగ్ వచ్చేస్తుంది.
అయితే ఎప్పటిలా రొటీన్ రుచులు కాకుండా
కాస్త వెరైటీ అప్పడాలివి... ప్రయత్నించి చూస్తారా?

అప్పడాలతో అదిరే విందు

సగ్గుబియ్యం అప్పడాలు



కావలసినవి: సగ్గుబియ్యం – ఒక కప్పు (కడిగి, సగ్గుబియ్యం రకాన్ని బట్టి, 3 గంటలు లేదా రాత్రి అంతా నానబెట్టుకోవాలి); నీరు – సరిపడా; ఉప్పు – తగినంత; జీలకర్ర – అర టీస్పూన్; నువ్వులు – ఒక టీ స్పూన్ (అభిరుచిని బట్టి); పచ్చిమిర్చి పేస్ట్ – ఒక టీస్పూన్ (అభిరుచిని బట్టి); నిమ్మ రసం – అర టీస్పూన్.

తయారీ: ముందుగా మందపాటి గిన్నెలో 4 కప్పుల నీరు పోసి మరిగించాలి. నీరు మరుగుతున్నప్పుడు, నానబెట్టిన సగ్గుబియ్యంలోని నీరు వంపేసి, మరిగే నీటిలో వేసుకోవాలి. కాసేపటికి ఉప్పు, జీలకర్ర, నువ్వులు, పచ్చిమిర్చి పేస్ట్ వేసుకుని బాగా కలుపుకోవాలి. మంటను మీడియంకు తగ్గించి, సగ్గుబియ్యం పూర్తిగా ఉడికే వరకూ అడుగంటకుండా, మధ్య మధ్యలో కలుపుతూ ఉండాలి. సగ్గుబియ్యం ఉడికిన తర్వాత, అది జిగురుగా మారుతుంది. ఒకవేళ మరీ గట్టిగా అనిపిస్తే కొద్దిగా నీరు కలపవచ్చు. చివరగా నిమ్మరసం కలిపి ఒకసారి కలుపుకొని స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారనివ్వాలి. మరీ పూర్తిగా చల్లారకుండా, గోరువెచ్చగా ఉండగానే, ఒక ప్లాస్టిక్ షీట్‌ను ఎండలో లేదా ఇంట్లోనే నేల మీద పరచుకుని, ఒక చిన్న స్పూన్ సహాయంతో కొద్ది కొద్దిగా సగ్గుబియ్యం మిశ్రమాన్ని గుండ్రంగా లేదా మీకు నచ్చిన ఆకారంలో అప్పడాల్లాగా వేసుకోవాలి. ఒకదానికొకటి కాస్తంత దూరం ఉంచాలి. వీటిని 2 లేదా 3 రోజుల పాటు ఎండలో బాగా ఆరనివ్వాలి. అప్పడాలు గట్టిగా తయారవ్వాలి. ఒకవైపు ఆరిన తర్వాత రెండోవైపుకు తిప్పి ఆరబెట్టాలి. అప్పడాలు పూర్తిగా ఆరిన తర్వాత, వాటిని ఒక ఎయిర్ టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవచ్చు. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.

వంటిల్లు

మిరియాల అప్పడాలు



కావలసినవి: బియ్యం పిండి – ఒక కప్పు; మిరియాల పొడి – 2 టీస్పూన్లు; ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– అర టీస్పూన్; వంట సోడా – చిటికెడు; నీళ్లు – కొద్దిగా; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ఒక గిన్నెలో కప్పు నీళ్లు పోసి మరుగుతుండగా మిరియాల పొడి, ఉప్పు, జీలకర్ర పొడి, వంటసోడా వేయాలి. కాసేపు మరిగాక అందులో బియ్యం పిండి వేసి అడుగంటకుండా బాగా కలపాలి. స్టవ్ మీదినుంచి దించేసి కాస్త చల్లారాక అందులో రెండు స్పూన్ల నూనె వేసి మరోసారి కలిపి, చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని గుండ్రని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. వీటిని ఎండలో ఒకటి లేదా రెండు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. బాగా ఎండిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు.

టమాటో అప్పడాలు



కావలసినవి: టమాటోలు – అరకేజీ; బియ్యం పిండి – రెండు కప్పులు; సగ్గుబియ్యం – కప్పు (నానబెట్టినవి); పచ్చిమిర్చి – 2 లేదా 3 (కట్ చేసి పేస్ట్‌లా చేసుకోవాలి); ఉప్పు – తగినంత; జీలకర్ర పొడి– టీస్పూన్; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: టమాటోలను బాగా కడిగి, కట్ చేసి, మెత్తగా, గుజ్జులా చేసుకోవాలి. ఒక గిన్నెలో బియ్యంపిండి, నానబెట్టిన సగ్గుబియ్యం, టమాటో గుజ్జు, తరిగిన పచ్చిమిర్చి పేస్ట్, ఉప్పు, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. అవసరమైతే కొద్దిగా నీరు చేర్చి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఈ పిండిని చిన్నచిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ షీట్‌పై కొద్దిగా నూనె రాసి, ఒక్కో ఉండను పలుచని అప్పడాల ఆకారంలో ఒత్తుకోవాలి. ఈ అప్పడాలను ఎండలో 2 లేదా 3 రోజుల పాటు బాగా ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత వాటిని నిల్వ చేసుకోవచ్చు.

స్వేచ్ఛగా .. రెక్కలు విప్పేలా...



అయోమ్ టీటో మతీజ్, మిస్ సౌత్ సుడాన్

అమ్మాయిలకు చదువు కాదుకదా.. కనీసం వ్యక్తిగత శుభ్రత పాటించే వెసులుబాటు కూడా లేని చోట అందాల పోటీలంటే ఆనందంగా సాగనంపుతారా? పంపరు! అయోమ్ టీటో మతీజ్‌కు కూడా తీవ్ర నిరసన ఎదురైంది! అయినా వెనకడుగు వేయకుండా అందాల పోటీలకు అటెండ్ అయింది.. మిస్ సౌత్ సుడాన్‌గా కిరీటం ధరించి మిస్ వరల్డ్‌కి పోటీపడ్డానికి హైదరాబాద్ చేరుకుంది. తన దేశ పరిస్థితులు, వ్యక్తిగత వివరాలు, తన లక్ష్యం వగైరా ఆమె మాటల్లోనే...

"లా చదివాను. లీగల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. సౌత్ సుడాన్‌లో పుట్టాను. కానీ అక్కడి రాజకీయ అనిశ్చితి వల్ల మా అమ్మ మమ్మల్ని తీసుకుని కెనడాకు వలస వచ్చేసింది. అందుకే నేను అక్కడే పెరిగాను. మా నాన్న, ఆయన తరపు, అమ్మ తరపు బంధువులంతా సౌత్ సుడాన్‌లోనే ఉండిపోయారు. మా అమ్మ కెనడాలో టీచర్‌గా ట్రైన్ అయ్యి, మా సొంత దేశంలోని పిల్లలకు మంచి స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి తిరిగి సుడాన్ వచ్చేసింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత 2019లో నేను మా కుటుంబాన్ని చూడ్డానికి నా సొంత దేశానికి వెళ్లాను. ఎమోషనలే కాదు.. కొంచెం షాక్ కూడా అయ్యాను. కెనడాలో నేను ఆస్వాదించిన జీవితం, సౌత్ సుడాన్‌లో మా వాళ్లంతా అనుభవిస్తున్న జీవితాన్ని బేరీజు వేసుకుని. అప్పుడే డిసైడ్ చేసుకున్నాను నా దేశ ప్రజలకూ ఉన్నత ప్రమాణాల జీవితం అందేలా కృషి చేయాలని! కోవిడ్ తర్వాత వచ్చేశాను. సర్వీస్ మొదలుపెట్టాను. నా బ్యూటీ విత్ పర్పస్ అదే!

అందాల పోటీలకు వ్యతిరేకం

అందాల పోటీల పట్ల సౌత్ సుడాన్‌లో చాలా వ్యతిరేకత ఉంది. నేను మిస్ సౌత్ సుడాన్ పాజెంట్‌లో పాల్గొంటున్నప్పుడు, ఇప్పుడు కూడా నిరసన ఎదురైంది. కానీ నా దృష్టిలో ఈ పోటీలు స్కిన్ షో కాదు. వైవిధ్యమైన సంస్కృతులు, భాషలు, జీవనశైలులను పరిశీలించే, అధ్యయనం చేసే అవకాశాన్నిచ్చే వేదిక. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. సర్దుబాటు, సహనాన్ని నేర్పిస్తుంది. ఇవన్నీ కూడా నా సామాజిక బాధ్యతను మెరుగ్గా నిర్వర్తించేందుకు తోడ్పడతాయి. అందుకే నిరసనను ఎదుర్కొని మరీ ఈ పోటీకి వచ్చాను. అంతేకాదు ఈ పోటీలు ఒకరినొకరు తెలుసుకుని, అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయం అందించుకునే స్ఫూర్తినీ పంచుతాయి. మహిళలకు అలాంటి స్ఫూర్తి, ప్రేరణ అవసరం. దానికి అందాల పోటీలే కావాలా అంటారేమో! స్త్రీకి స్త్రీయే శత్రువు అనే నానుడి ప్రపంచ వ్యాప్తంగా పాతుకుపోయి.. అది స్త్రీల సహజ లక్షణమనే అభిప్రాయమూ అంతే లోతుగా నాటుకుపోయింది. దాన్ని అబద్ధమని నిరూపిస్తున్నాయి ఈ పోటీలు! కొన్ని దేశాల పేర్లే తెలియవు నేనీ కంటెస్ట్‌కి వచ్చేదాకా! అందుకే పట్టుబట్టి మరీ ఈ పోటీకి వచ్చాను. ఇక్కడి వైవిధ్యత, ఆధ్యాత్మికత నన్ను చాలా ఇన్‌స్పైర్ చేశాయి. ఈ దేశంలోని వాళ్లను చూస్తే నాకు ఫారినర్స్‌గా అనిపించరు. మా వాళ్లలాగే అనిపిస్తారు. ఎప్పుడో ఎక్కడో తప్పిపోయి.. ఇప్పుడు కలుసుకుంటున్నామేమో అనిపిస్తోంది! తెలంగాణ గురించి చెప్పుకోవాల్సి వస్తే ఇక్కడి ఎడ్యుకేషన్, మెడికల్ కేర్ గురించి కచ్చితంగా మాట్లాడుకోవాలి. ప్రపంచ ప్రమాణాలతో పోటీపడుతున్నాయి. సౌత్ సుడాన్ యువత తమ ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కే వస్తోంది. మా దేశంలోని చాలామంది ప్రజలు ఆరోగ్య అవసరాల కోసం ఇక్కడి హాస్పిటల్స్‌నే ఆశ్రయిస్తున్నారు.

> మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్లు కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్ళకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి.

బాల్య వివాహాలు.. బలవంతపు పెళ్లిళ్లు

ప్రపంచంలోని అనేక దేశాల్లాగే సౌత్ సుడాన్‌లోనూ పురుషాధిపత్యమే! కొడుకుకే ప్రాధాన్యం. అమ్మాయికి వ్యక్తిగత శుభ్రత విషయంలోనూ ఆర్థికపరమైన వెసులుబాటు ఉండదు. బాల్యవివాహాలు, బలంతపు పెళ్లిళ్లు కామన్. ఇక చదువుకునే అవకాశమెక్కడిది? నేను ఇక్కడిదాకా రాగలిగాను అంటే మా అమ్మే కారణం. మమ్మల్ని ఆమె కెనడా గనుక తీసుకువెళ్లకపోయుంటే నా పరిస్థితి ఎలా ఉండేదో (ఈ మాట చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో నీళ్లు). నాకింకా గుర్తు.. ఆమె లగేజ్ సర్దుతుంటే 'మనం ఎక్కడికి వెళ్తున్నాం?' అని అడిగాను. 'మీరు స్వేచ్ఛగా మీకు నచ్చింది చదువుకునే చాన్స్ ఉన్న చోటికి' అని చెప్పింది! మేం నలుగురు అక్కచెల్లెళ్లం. మాకొక తమ్ముడు. అందరినీ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది అమ్మ. ఎలాంటి అవకాశాల కోసం అమ్మ మమ్మల్ని కెనడాకు తీసుకెళ్లిందో అలాంటి అవకాశాలనే సౌత్ సుడాన్‌లోని అమ్మాయిలకూ కల్పిస్తోంది తాను నడిపిస్తున్న స్కూల్ ద్వారా! ఆమె చేస్తున్న ఆ సర్వీస్‌కి నేనూ శాయశక్తుల సాయపడుతున్నాను. మా దేశంలోని యంగ్ గర్ల్స్‌కి నేను మెంటర్‌గా ఉండాలి! వాళ్ల కలలను సాకారం చేసుకునేలా నేను తోడ్పడాలి. వాళ్లకు రెక్కలున్నాయనే విషయాన్ని గ్రహించేలా చేయాలి. సాధికారతకు, సామాజిక బాధ్యతకు ఐకాన్స్‌గా ఉండి, తర్వాత తరాలను ఇన్‌స్పైర్ చేసేలా వాళ్లను తీర్చిదిద్దాలి. ఇదంత సులువైన జర్నీ కాదు. అయినా ప్రయత్నం వీడను!" అంటూ తన జర్నీ గురించి చెప్పారు మిస్ సౌత్ సుడాన్.

– సరస్వతి రమ
ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

కూల్ రూఫ్ టెక్నాలజీ



కూల్ సమ్మర్

పెరుగుతున్న వేడిని తట్టుకోవడానికి సామాన్యులు తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో కూల్ రూఫ్స్ ప్రోగ్రామ్ ఒకటి. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా టైటానియం ఆక్సైడ్‌లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ప్రత్యేకమైన వైట్ పెయింట్‌ను రూఫ్ టాప్‌లకు వేస్తారు.

దీనికి ముందు రూఫ్‌ను చెత్త, మురికి లేకుండా శుభ్రపరుస్తారు. 'వైట్ పెయింట్ వల్ల ఏ మేరకు ఫలితం ఉంటుంది?' అనే విషయానికి వస్తే... ఉష్ణోగ్రతలలో చెప్పుకోదగ్గ తగ్గుదల కనిపిస్తుందని ప్రాథమిక పరీక్ష ఫలితాలు తెలియజేస్తున్నాయి. 'సోలార్ రెఫ్లెక్టివ్ వైట్ పెయింట్ నార్మల్ పెయింట్ కాదు' అంటుంది అహ్మదాబాద్‌లోని 'మహిళా హౌజింగ్ ట్రస్ట్' మేనేజర్ దీపిక వద్గామ.

'రూఫ్‌కు రెండుసార్లు పెయింట్ వేయడం మంచిది. మొదటి లేయర్‌కు, రెండో లేయర్‌కు మధ్య కనీసం రెండు గంటల విరామం ఉండాలి' అంటుంది దీపిక. 'అధిక వేడి వల్ల ఇబ్బంది పడకుండా హోమ్-బేస్ వర్కర్స్‌కు కూల్ రూఫ్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. వారు చేసే పనికి అంతరాయం ఏర్పడకుండా ఉంటుంది' అంటుంది దీపిక. అహ్మదాబాద్‌లోని లాల్ దర్వాజ బస్‌స్టాప్‌ను 'కూల్ బస్ స్టాప్'గా క్లైమేట్-ఫ్రెండ్లీగా డిజైన్ చేశారు.

'ఒకప్పుడు వేసవికాలంలో ఇంట్లో ఉండడం కష్టంగా ఉండేది. వేడి తట్టుకోలేక కుట్టుమిషన్ పని ఆపేయాల్సి వచ్చేది. సోలార్ రిఫ్లెక్టివ్ వైట్ పెయింట్ వల్ల ఇంట్లో వేడి బాగా తగ్గింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసుకోగలుగుతున్నాను. వచ్చే సంవత్సరం కూడా రూఫ్‌కు వైట్ పెయింట్ వేయిస్తాను' అంటుంది సంగీత బెన్ అనే గృహిణి.